కాప్రా సర్కిల్ డీసీగా జగన్ బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరించిన జగన్

కాప్రా, ఆగస్టు 24:కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పి.ముకుందరెడ్డి బదిలీ అయ్యారు. ఆయనను శేరిలింగంపల్లి సర్కిల్‌కు బదిలీ చేస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఖైరతాబాద్ సర్కిల్ డీసీ డి.జగన్ కాప్రా డీసీగా బదిలీ కాగా, ఆయన శనివారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం ఈఈ హరిలాల్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ గిరిరాజ్, ప్రాజెక్టు అధికారి నాగార్జున్‌రెడ్డి, శానిటేషన్ విభాగం డీఈఈ లావణ్య, ఏఎంసీలు షానవాజ్, అశోక్, విజయరాజు, రాజు , ఇతర అధికారులు, సిబ్బంది నూతన డీసీని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ముఖ్య విభాగాల ప్రధాన అధికారులతో డీసీ సమావేశమై ఆయా విభాగాల పనితీరును సమీక్షించారు.

స్పోర్ట్స్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలి

కీసర,ఆగస్టు 24: మండలంలో స్పోర్ట్స్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కీసర మండలంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక స్పోర్ట్స్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని, ఆ మేరకు మండలంలోని భోగారంలో సర్వే నంబర్ 283లోని ప్రభుత్వ భూమిలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలని, ఇది ఔటర్‌రింగ్ రోడ్డుకు దగ్గరగా ఉందని ఆయన తెలిపారు.

ఈస్ట్ దీన్‌దయాల్‌నగర్‌లో పెట్రోలింగ్ చేయాలి

ఎస్సై రమేశ్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న ఈస్ట్ దీన్‌దయాల్‌నగర్ కాలనీవాసులు

నేరేడ్‌మెట్, ఆగస్టు 24 : వినాయకనగర్ డివిజన్, ఈస్ట్ దీన్‌దయాల్‌నగర్ కాలనీలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని, బ్లూకోర్ట్స్ పోలీసులు నిరంతరం గస్తీ తిరగాలని స్థానికులు కోరారు. ఈ మేరకు శనివారం వారు నేరేడ్‌మెట్ పోలీసులను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాత్రి 1 గంటైతే రోడ్లపై ఆకతాయిలు తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారని, పోలీసులు వెంటనే స్పందించి రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించాలని కోరారు. వినతిపత్రాన్ని అందించినవారిలో కాలనీ అధ్యక్షుడు బీఎన్ కృష్ణ, రవీందర్, గౌరీశంకర్, రాము, గుర్రాల ఆనంద్‌రావు, కృష్ణమూర్తి, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

శామీర్‌పేట, ఆగస్టు 24 : మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అలియాబాద్ ఏఈ శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33-11కేవీ తుర్కపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ యాడారం వ్యవసాయ ఫీడర్‌లో మరమ్మతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీంతో యాడారం, మురహార్‌పల్లి గ్రామాలతో పాటు పరిశ్రమలు, వ్యవసాయ క్షేత్రాలకు ఆదివారం ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

మేడ్చల్, ఆగస్టు 24 : మేడ్చల్ పట్టణంలోని అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ గురు స్వాములు రాజేశ్వర గురుస్వామి, కృష్ణమూర్తి గురుస్వామి నేతృత్వంలో ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మహాభిషేకం, అర్చన, నివేదన, అలంకరణ, హారతి, మంత్ర పుష్పం, పడిపూజ, తదితర పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. పూజల్లో గురుస్వాములు నర్సింహస్వామి, అనిల్, ప్రశాంత్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

పూల అలంకరణలో అయ్యప్ప స్వామి

రోడ్డుపై గుంత.. వాహనదారులకు చింత

గత కొన్ని నెలలుగా వాయిపురి ప్రధాన రోడ్డులో ఏర్పడిన పెద్ద గుంతతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో రోడ్లన్నీ గుంతలు పడ్డాయి. ప్రధాన రహదారికావడంతో నిత్యం వేలాదిమంది ఈ దారిలో రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా రాత్రిపూట గుంతలరోడ్డును గుర్తించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.
– నేరేడ్‌మెట్, ఆగస్టు 24

ప్రభుత్వ కళాశాలలో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

ఫ్రెషర్స్‌డే వేడుకల్లో విద్యార్థినుల నృత్యాలు

నేరేడ్‌మెట్, ఆగస్టు 24 : విద్యార్థుల నృత్యాలు..కేరింతల మధ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే ఉత్సాహభరితంగా సాగింది. వాజ్‌పెయినగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి కిషన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నూతన ప్రిన్సిపాల్ ఉమాదేవి,అధ్యాపకులు డాక్టర్ గోపి, డాక్టర్ రాజమౌలి, రహీముద్దీన్, విద్యాసాగర్ రెడ్డి, శోభారాణి, సంతోషి, వంశీ, అగస్టీన్‌పాల్, లక్ష్మి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇంటింటికీ సర్వే నిర్వహించండి

బీఎల్‌వో యాప్‌తో ఇంటింటికీ సర్వేపై శిక్షణ ఇస్తున్న దృశ్యం.

శామీర్‌పేట, ఆగస్టు 24 : ఓటరు జాబితా సవరణకు బీఎల్‌వోలు హౌస్ టూ హౌస్ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని తూంకుంట మున్సిపాలిటీ కమిషనర్ వెంకట గోపాల్ ఆదేశించారు. మున్సిపల్ సమావేశం మందిరంలో శనివారం బీఎల్‌వోలకు బీఎల్‌వో యాప్ ద్వారా హౌస్ టూ హౌస్ సర్వేపై శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్త ఓటరు నమోదు, ఓటర్ల జాబితా, సవరణ చేయడానికి బూత్ లెవల్ ఆఫీసర్లకు శిక్షణ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఇంటింటికి తిరిగి యాప్‌లో నిర్దిష్టమైన సమాచారం పొందుపరచాలని ఆదేశించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్ శ్రావణ్‌కుమార్, ఆర్ఐ భాస్కర్, బీఎల్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

హబ్సిగూడ జడ్పీహెచ్ఎస్‌లో సైన్స్ ఫెయిర్

ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న ఏంఈవో రామారావు

రామంతాపూర్,ఆగస్టు 24 : హబ్సిగూడ జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో శనివారం అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ మండల విద్యాధికారి రామారావు హాజరై విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్‌ను తిలకించారు. విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లత, వెంకటేశ్వర్లు, యాదగిరి రెడ్డి, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా నీరు సరఫరా చేయాలి

జలమండలి అధికారులకు వినతి పత్రం సమర్పిస్తున్న ప్రజలు

మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 24 : దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో ఉచితంగా నీరు సరఫరా చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు మున్సిపాలిటీ పరిధిలోని ప్రగతినగర్, ఖుషీగార్డెన్, శివానందపురి, వెస్ట్ గాంధీనగర్ కాలనీలకు చెందిన ప్రజలు శనివారం ప్రగతినగర్ పార్కులో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నీటి సరఫరాపై ఆయా కాలనీలకు ఉచితంగా నీరు సరఫరా చేయాలని తీర్మానించారు. అనంతరం జలమండలి అధికారులను కలిసి ఉచితంగా నీరు సరఫరా చేయాలని, బకాయిలు మాఫీ చేయాలని వినతి పత్రం అందజేశారు.

హోటళ్లలో ఆకస్మిక తనిఖీ ..జరిమానా

మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 24 : నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ హోటళ్లను శనివారం కమిషనర్ రాజేందర్ కుమార్ ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. వండి, వడ్డిస్తున్న ఆహార పదార్థాలు, పాటిస్తున్న పరిశుభ్రతను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని ఆరు హోటళ్లకు రూ.95వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యతలేని ఆహారాన్ని విక్రయించే హోటళ్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చీర్యాల్ భక్తులకు అన్నదానం

కీసర, ఆగస్టు 24 మండల పరిధి చీర్యాల్‌లోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం దేవస్థానం ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున వచ్చి స్వామివారిని దర్శించుకుని అన్న దాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చైర్మన్ మల్లారపు లక్ష్మీ నారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డిలో జాతీయ అంతరిక్ష దినోత్సవం



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న డీఆర్‌డీవో శాస్త్రవేత్త ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్

మేడ్చల్, ఆగస్టు 24 : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శనివారం అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీవో శాస్త్రవేత్త ప్రవీణ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ.. ఉపగ్రహాల ప్రయోగంలో దేశంలో ఎంతో పురోగతి సాధించిందన్నారు. అగ్రదేశాల సరసన నిలిచేందుకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. చంద్రయాన్ 3 విజయం దేశాన్ని ఉన్నత స్థానంలో నిలిపిందన్నారు. అంతరిక్ష రంగంలో విశేషంగా కృషి చేస్తూ దేశానికి ముందుకు తీసుకెళ్తున్న శాస్త్రవేత్తలకు హ్యాట్సాప్ చెప్పాలన్నారు. విద్యార్థులను వారిని స్ఫూర్తిగా తీసుకొని, అంతరిక్ష రంగంలో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, పేపర్ ప్రజెంటేషన్ తదితర పోటీలను నిర్వహించి, బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్, హెచ్‌వోడీ సంపత్ కుమార్, కన్వీనర్లు వంశీ, శివకుమార్, పాషా, పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

మల్కాజిగిరి: అల్వాల్‌లోని ఐ రిజ్ గ్లోబల్ స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలో చిన్నారులు

రామంతాపూర్: అకాడమిక్ హైట్ ఉట్టి కొడుతున్న చిన్నారులు

మేడ్చల్: న్యూ లిటిల్ లిల్లీ హైస్కూల్‌లో చిన్ని కృష్ణుడు, గోపిక వేషధారణతో చిన్నారులు

కీసర: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో జన్మాష్టమి వేడుకలు

మల్లాపూర్‌లోని శ్రీనికేతన్ హైస్కూల్లో ..

కీసర, ఆగస్టు 24: మండల పరిధి రాంపల్లిదాయరలోని జూబ్లీహిల్స్ స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఉట్టి కొట్టే కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మజతో పాటు పలువురు పాల్గొన్నారు.

● రామంతాపూర్: నాచారం అకాడమిక్ హైట్స్ బచ్‌పన్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణుడి వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణుని పుట్టుక గురించి నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సీహెచ్ శివకుమార్, పాఠశాల కరస్పాండెంట్ కల్పన, ప్రధానోపాధ్యాయులు డి. సరిత, తదితరులు పాల్గొన్నారు.

● మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని న్యూ లిటిల్ లిల్లీ హైస్కూల్‌లో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మంజులా ప్రకాశ్ ఆధ్వర్యంలో పూర్వ ప్రాథమిక విద్యార్థులు గోపిక, చిన్ని కృష్ణుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు.

● మల్కాజిగిరి: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భాగంగా టెంపుల్ అల్వాల్‌లోని ఐ రిజ్ గ్లోబల్ స్కూల్‌లో చిన్నారులు శ్రీకృష్ణ వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రిషిత, టీచర్లు కవిత, శ్వేత, సాయిలత, ధనశ్రీ, శివానీ, శీలారాణి తదితరులు పాల్గొన్నారు.

● మల్లాపూర్: మల్లాపూర్‌లోని శ్రీనికేతన్ హైస్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో ఆకట్టుకున్నారు. చిన్నారులతో పాటు పాఠశాల కరస్పాండెంట్ చిక్క నర్సింహ, రేణుక, లావణ్య వర్మ, టీచర్లు అలివేలు, విజయ, భాగ్య, అనిత, దివ్య మౌనిక, లావణ్య పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి, భరతనాట్య నృత్యాలు

కొండాపూర్, ఆగస్టు 24 : వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు నృత్య కారులు కూచిపూడి, భరతనాట్య నృత్యరీతులతో అలరించారు. బెంగుళూరు నుంచి విచ్చేసిన సంగీత ఇయర్ పుష్పాంజలి, శాంతాకారం, త్యాగరాజ కృతి, అన్నమాచార్య కీర్తన అంశాలను భరతనాట్య నృత్యరూపకంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అనంతరం సత్యం డాన్స్ అకాడమీ, కూచిపూడి నాట్య గురువులు మేళ్లచెరువు కామేశ్వరి తన శిష్యబృందంతో కలిసి పూజ, మధురాష్టకం, కృష్ణం వందే జగద్గురుమ్, కస్తూరి తిలకం, దేహి దేహి, కొలువైతివా, శివాష్టకం, తారంగం, అన్నమయ్య సంకీర్తన అంశాలను కళ్యాణి, అక్షిత, కీర్తన, సర్వాణి, శ్రీయ, అనన్యలతో కలిసి కూచిపూడి నృత్యరూపకంలో నర్తించిన తీరు ఆద్యాంతం అలరించాయి.

నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

ఉప్పల్ నల్లచెరువు అభివృద్ధికి చర్యలు

జడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్


ఉప్పల్ నల్లచెరువును సందర్శించి పనులను పరిశీలిస్తున్న జడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్

రామంతాపూర్,ఆగస్టు 24 : ఉప్పల్ నల్లచెరువును శనివారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ సందర్శించారు. చెరువు అభివృద్ధి కోసం శనివారం స్థానిక కార్పొరేటర్ రజితతో కలిసి ఆయన పరిశీలించారు. నల్లచెరువులో అభివృద్ధి పనులతో పాటు చెరువు పరిరక్షణకు చేపట్టాల్సిన పనులకు సంబంధించిన నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ ఈఈ హరికృష్ణ, ప్రాజెక్టు ఈఈ రోహిణి, డీఈ రవీందర్, వాక్ గ్రీనరీ ప్రాజెక్టు అధికారి అప్రోజ్, హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు ఈఈ సర్సింగ్ రావు, డీఈ సరిత, ఉప్పల్ డీసీ ఆంజనేయులు, ఈఈ నాగేందర్, మైత్రేయి, నాయకులు లక్ష్మణ్, సల్ల ప్రభాకర్‌రెడ్డి, అనిల్ కుమార్, భాస్కర్, రాఘవేందర్, హనుమంత్, ప్రశాంత్‌రెడ్డి, నవీన్ పిరంబి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్, ఆగస్టు 24: మల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయంలో శనివారం కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఎంటమాలజీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని ఎంటమాలజీ సిబ్బందికి సూచించారు. డివిజన్ పరిధిలోని సూర్యనగర్ ప్రభుత్వ, బస్తీ దవాఖానలో వైద్య సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ రమేశ్, కనకరాజు, నర్సింహ, స్థానిక నాయకులు పీఆర్ ప్రవీణ్, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులకు సత్కారం

మల్లాపూర్, ఆగస్టు 24 : చర్లపల్లి డివిజన్, ఓల్డ్ సోనియాగాంధీనగర్ నూతన కార్యవర్గ సభ్యులు శనివారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆమె.. నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాలనీలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని కాలనీవాసులకు సూచించారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గం అధ్యక్షురాలు ప్రభావతి, వైస్ ప్రసిడెంట్ వెంకట్రావు, రాంచందర్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌బాబు, జాయింట్ సెక్రటరి యాకుబ్, కృష్ణ, సతీశ్, ఆర్గనైజింగ్ సెక్రటరి ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్, కోశాధికారి ఆంజనేయులు,గిరి, పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్

అబద్ధపు ప్రకటనలు మానుకోవాలి

సమావేశంలో పాల్గొన్న సీపీఐ (ఎంఎల్) ప్రతిఘటన పార్టీ నాయకులు

మేడ్చల్‌రూరల్,ఆగస్టు 24: పార్టీ నుంచి వెళ్లిపోయిన నాయకులు సీపీఐ (ఎంఎల్) ప్రతిఘటన పార్టీపై అబద్ధపు ప్రకటనలు మానుకోవాలని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు అన్నారు. శనివారం గుండ్లపోచంపల్లిలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ నుంచి వెళ్లిపోయిన పేక్షావలి, సంతోష్‌లు ప్రతిఘటన పార్టీ పేరు చెప్పుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అంతే కాకుండా పార్టీ కార్యకర్తలను కించపరిచే విధంగా ప్రకటనలు చేయడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి సైదులు, ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ బోనుగుల లలిత, తెలంగాణ రైతు కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాము, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కామ్రేడ్ జీవన్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

జగద్గిరిగుట్ట, ఆగస్టు24:అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. సీఐ క్రాంతి కుమార్ వివరాలమేరకు జగద్గిరిగుట్ట సమీపం రిక్షాపుల్లర్స్ కాలనీకిచెందిన కృష్ణవాటర్‌లైన్‌మెన్‌గా పనిచేస్తాడు. అతని కుమార్తె మనీషా(26) అదేప్రాంతానికి చెందిన ఎల్లయ్య కుమారుడు రాజశేఖర్ ప్రేమించుకోగా గతనెల 10న వివాహమైంది. అల్వాల్ పరిధిలో నమోదైన కేసులో నిందితుడైన రాజశేఖర్ జైలుకు వెళ్లాడు. బెయిల్‌పై తిరిగివచ్చాక మనీషా అత్తవారింటికి వెళ్లింది. కట్నం తీసురావాలని ఆమెను భర్త కుటుంబసభ్యులు వేధిస్తుండడంతో ఈనెల 11న యాసిడ్ తాగింది. అపస్మారక స్థితిలోఉన్న ఆమె కూకట్‌పల్లిలో ఓప్రైవేటు ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోంది. మనీషా తండ్రి కృష్ణ ఫిర్యాదు చేయగా శనివారం కేసు నమోదు చేశారు.